నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 3 జూన్ 2024 | ADILABAD NIRMAL


నిర్మల్ కలెక్టరేట్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ జానకి షర్మిల


ఆదిలాబాద్‌లో జెండా వందనం చేస్తున్న ఉద్యోగులు

# దశాబ్ది వైభవం

● కలెక్టర్ కార్యాలయాల్లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ● జాతీయ జెండాలను ఎగురవేసిన ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్లు

**ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల** వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఆదివారం వైభవంగా కొనసాగాయి. ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు వేడుకలకు హాజరయ్యారు. కలెక్టర్, ఎస్పీలు అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కలెక్టర్ రాజర్షి షా కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగురవేశారు. నిర్మల్ కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో కూడా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్‌లతో కలిసి అవతరణ వేడుకల్లో పాల్గొన్నారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేసి స్వీట్లను పంచిపెట్టారు. మొదటగా కలెక్టర్, ఎస్పీ జానకి షర్మిల అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. ఆ తర్వాత మహనీయుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- ఆదిలాబాద్(నమస్తే తెలంగాణ)/నిర్మల్ అర్బన్, జూన్ 2


అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

## ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతున్నదని, ప్రభుత్వం ప్రజల అకాంక్షలకు పెద్దపీట వేస్తున్నదని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చే స్తుందన్నారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, పేదలకు ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా, రుణ మాఫీ పథకాల్లో భాగంగా వ్యవసాయ కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కా ర్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఆర్డీవో వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


జెండా వందనం చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా. ప్రసంగిస్తున్న కలెక్టర్


నిర్మల్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు

## అభివృద్ధికి పాటు పడుదాం..

**నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**



ప్రజలందరి భాగస్వామ్యంతో జిల్లా అభివృద్ధికిపాటు పడుదామని నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్మల్ కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. త్యాగధనులు ప్రదర్శించిన ఉద్యమస్ఫూర్తి మరువలేనిదని పేర్కొన్నారు. వారందరి పోరాటాల ఫలితమే రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపుకునే భాగ్యం కలిగిందని అన్నారు. ప్రతి ఒక్కరు అంకితభావంతో జిల్లా, రాష్ట్ర అభివృద్ధికిపాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఆర్డీవో రత్న కల్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


జెండాకు వందనం చేస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ, అధికారులు





# ఆవిర్భావ వేడుకల్లో నేతలు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పాల్గొన్నారు. వీరు ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. అమరవీరుల ఆకాంక్షలను ప్రతిబింబించేలా స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన సాగిందన్నారు.

- ఎదులాపురం, జూన్ 2



# కొనసాగుతున్న పంపిణీ

ఆదిలాబాద్, జూన్ 2(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో రెండు రోజుల విరామం అనంతరం పత్తి విత్తనాల పంపిణీ ప్రారంభమైంది. జిల్లాకు 27,936 ఆర్‌సీహెచ్ 659 పత్తి విత్తన ప్యాకెట్లు రాగా.. ఆదివారం జిల్లా కేంద్రంతోపాటు వివిధ మండలాల్లో వ్యాపారులు విత్తనాలను పంపిణీ చేశారు. ఇంతవరకు ఒక్కో రైతుకు రెండు ప్యాకెట్లు ఇవ్వగా.. ఆదివారం నాలుగు ప్యాకెట్లు ఇచ్చారు. జిల్లాలోని 16 మండలాల్లో 138 డీలర్ల వద్ద విత్తన విక్రయాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మండలాల్లో సరఫరా చేయడంతో జిల్లా కేంద్రంలోని దుకాణాల్లో రద్దీ కనిపించలేదు. 1.50 లక్షల ఆర్‌సీహెచ్ 659 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయని గుర్తించి కంపెనీల నిర్వాహకులతో మాట్లాడి విత్తనాలను జిల్లాకు వచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పూర్తి స్థాయిలో విత్తనాలను పంపిణీ చేస్తామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.


విత్తనాల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

## పంపిణీని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్‌లో ఆదివారం పత్తి విత్తనాల సరఫరాను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం పరిశీలించారు. పలు దుకాణాల్లో తిరుగుతూ వ్యాపారులు, రైతులతో మాట్లాడి పంపిణీ సరిగా జరుగుతుందా? లేదా? అనే విషయాలను తెలుసుకున్నారు. పత్తి విత్తనాల కొరత నివారణకు చర్యలు తీసుకున్నామని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా విత్తనాలను పంపిణీ చేయాలని వ్యాపారులకు సూచించారు. ఇతర కంపెనీల విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. కేంద్రాల వద్ద నీడ, మంచినీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, వ్యవసాయ అధికారి విశ్వామిత్ర ఉన్నారు.


జెండాకు వందనం చేస్తున్న ఐటీడీఏ పీవో, సిబ్బంది

## గిరిజనుల ప్రగతికి కృషి

**- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా**

ఉట్నూర్, జూన్ 2 : గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తున్నదని పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. ఆదివారం తెలంగాణ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు ఇతర ప్రాంతాలతో పోటీ పడేలా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యను అందిస్తున్నామన్నారు. డీడీ దిలీప్ కుమార్, ఏపీవో జనరల్ భీంరావు, ఈఈ భీంరావు, ఏవో రాంబాబు, పీవీటీజీ ప్రత్యేకాధికారి భాస్కర్, ఏజెన్సీ అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్, సీడీపీవో, జేడీఎం నాగభూషణం, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, గురుకులం ఆర్‌సీవో గంగాధర్, ఏసీఎంవో జగన్, ఏటీడీవో క్రాంతి పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ సంబురం


పటాకులు కాలుస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

ఎదులాపురం, జూన్ 2 : మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకున్నాయి. స్వరాష్ట్ర స్వప్నం సాకారమైన రోజు విజయం సాధించడంతో శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకున్నది. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వద్ద నేతలు పటాకులు కాలుస్తూ, స్వీట్లు పంపిణీ చేసుకుంటూ సంబురాలు చేసుకున్నారు. జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే ప్రజల్లో వ్యతిరేకతను మూటగట్టుకుందని, అందుకు తాజాగా వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ సమయంలో వందలాది మంది విద్యార్థుల బలిదానానికి కారణం కాంగ్రెస్ పార్టీనేనని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల ఫలితాలతోపాటు రానున్న అన్ని ఎన్నికల్లోనూ గులాబీ జెండా రెపరెపలాడనుందని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తోపాటు బీఆర్ఎస్ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు దాసరి రమేశ్, జడ్పీటీసీ సుధాకర్, కౌన్సిలర్లు భూమన్న, పండ్ల శ్రీనివాస్, అశోక్ స్వామి, లస్మన్న, ఆశన్న, రాము, నీరటి ఉదయ్, తులసి, కరుణ పాల్గొన్నారు.



బిందెడు నీటి కోసం పడిగాపులు కాస్తున్న గిరిజనులు

# పల్సి గొంతెండుతోంది..

## తాగునీటి కోసం తండాల్లో తండ్లాట

- నల్లా నీళ్లు రాక నాలుగు రోజులు
- ఉదయం నాలుగు గంటలకే బావి వద్ద బిందెలు, క్యాన్లు దర్శనం
- నీళ్లు మోసుకొచ్చేందుకు రెండు కిలో మీటర్ల కాలినడక
- పట్టించుకోని భగీరథ అధికారులు.. అడుగంటిన బోరు బావులు

**దశాబ్ద కాలంగా** జలసిరితో అలలారిన పల్లెలు.. ప్రస్తుతం అడుగంటిన బావులే దర్శనమిస్తున్నాయి. సరిగ్గా పదేండ్ల క్రితం రోడ్లపై దర్శనమిచ్చిన బిందెలు, డ్రమ్ములు మళ్లీ కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పుణ్యమాని బావుల వద్ద సిగపట్టు యుద్ధాలు మొదలయ్యాయి. చేను పనులకు డుమ్మా కొట్టి.. కూలీ ఎగ్గొట్టి.. నీటి కోసం రాత్రింబవళ్లు జాగారం చేయాల్సిన దుస్థితి రానేవచ్చింది. పదేండ్లపాటు భగీరథ నీటిని తాగిన ప్రజలు మళ్లీ బోరుబావులు, బోరింగు నీటిని తాగి దాహం తీర్చుకోవాల్సిన దుర్భర పరిస్థితి వచ్చింది. పదేండ్లుగా ఏనాడు తలెత్తని, పల్లెవాసులు కలలో కూడా ఊహించని కరువు ఇప్పుడే ఎందుకొచ్చింది? ఎవరు తెచ్చారు? అని మనం మననం చేసుకోవాల్సిన సందర్భం ఇదీ.

- తాంసి(తలమడుగు), జూన్ 2


బావిలో అడుగంటిన నీరు

తలమడుగు మండలంలోని పల్సి తండాలో భగీరథ నీరు నాలుగు రోజులుగా రాకపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. వేకువజామున నాలుగు గంటలకే రెండు కిలో మీటర్ల దూరంలోని బావి వద్దకు వెళ్లి నిత్యావసరాలకు సరిపడా నీరు తీసుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మూగజీవాలకు కూడా నీళ్లు లేక అలమటిస్తున్నాయని అంటున్నారు. ప్రజలు ఎంత పొదుపుగా నీటిని వాడుతున్నప్పటికీ అవసరాలు తీరడం లేదు. సంబంధిత అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించి భగీరథ నీరు అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రెండు కిలోమీటర్లు నడిస్తేనే నీళ్లు..

పదేండ్లుగా ఇంట్లో అవసరాలు తీర్చుకోవడంతోపాటు తాగేందుకు భగీరథ నీరే వాడుతున్నం. బోర్లలో నీళ్లు ఇంకిపోవడంతో రెండు కిలో మీటర్లు కాలినడకన వెళ్లి బావి నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఇప్పుడు నాలుగు రోజుల నుంచి నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. కనీసం స్నానం చేయడానికి కూడా నీరు దొరుకడం లేదు.

**- మడావి లక్ష్మీబాయి, పల్సి, గ్రామస్తురాలు**

